


# జయ రవిచంద్ర

## ఆస్ట్రేలియా



# 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

మా మంచి టీచర్లు అనే టాపిక్ వినగానే నాకు చిన్ననాటి రోజులు వెంటనే గుర్తు వచ్చాయి. ప్రతి వ్యక్తి తరిచి చూసుకుంటే తమ జీవితపు ప్రాధమిక దశలో ఎవరో ఒక ప్రత్యేక వ్యక్తి ప్రభావానికి లోను కావడం ఎంతో సహజం. అయితే ఈ వ్యక్తి ఒక బంధువో, మిత్రువో మాత్రం కారు. మనం ఎన్నో గంటలు వారితో గడిపిన ఈ ప్రత్యేక వ్యక్తి తప్పక మనకు చదువు నేర్పే గురువే! ఈ గురువు ఒకరు కావచ్చు ఒకరి కంటే ఎక్కువ మంది కావచ్చు. ఒక్కొక్కరి ప్రభావం ఒక్కో రీతిలో మనని తీర్చిదిద్దుతుంది.

ఇక నా సంగతికి వస్తే అవి 6వతరగతి నుండి 10 వరకు చదువుకున్న ఒక ప్రైవేటు స్కూల్ విద్యార్ధిని జ్ఞాపకాలు.

క్రిష్ణమూర్తి మాస్టారు టీచరుగా నాకు హైదరాబాదులోని మొహదీపట్నం దగ్గర్లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్కూల్‌లో పరిచయం అయ్యారు. మా స్కూల్లో హింది నేర్పేవారు మాష్టారు. నాకు చదువు నేర్పింది నాలుగు సంవత్సరాలే అయినా ఆయనతో నా పరిచయం సుమారు ఓ 20 సంవత్సరాలు అని చెప్పగలను. నా మనసులో గురువు అంటే ఇలా ఉండాలి అనేలా ఒక ప్రత్యేక ముద్ర వేసిన వ్యక్తి ఆయన. ఆయన ఎంతో సాధారణంగా తెల్ల పంచె, ఖద్దరు కండువా, చేతిలో ఓ బాగ్ పుచ్చుకు కనబడేవారు. మొహంలో ఎప్పుడూ చెరగని నవ్వు! ఆ మర్చిపోయాను కళ్ళకి ఓ జోడు కూడానూ! మా మాస్టారు అంటే క్రమశిక్షణకు మారు పేరు. పేరుకు హిందీ టీచరు అయినా ఆయన మాకు చాలా విషయాలలో సహాయం చేసేవారు. ఇక తుంటరి పిల్లలకు ఆయన అంటే హడల్! ఏ మాటకు ఆ మాటే ఆయనకు కోపం వస్తే చేతి కర్రకు పని చెప్పేవారు. అంతదాకా రానిచ్చేవారు కాదు కానీ వస్తే ఆయన్ని ఆపటం ఎవరితరం కాదు. కోపం వస్తే ఇలా ఉండే మాస్టారికి ప్రేమ, వాత్సల్యం కూడా ఆభరణాలే! తోటి టీచర్లు కూడా ఆయనకు ఎంతో గౌరవం ఇచ్చి, ప్రతి ఒక్క విషయంలో వారిని సంప్రదించేవారు. ఆఖరుకు ప్రిన్సిపల్ గారు కూడా ముఖ్యవిషయాలు మాస్టారితో చర్చించేవారు. స్కూల్ పోటీలలో ఆయన్ని న్యాయ నిర్ణేతగా నియమించేవారు కూడాను.

అబద్ధం చెప్పడం ఆయన సహించేవారు కారు, దెబ్బలు పడతాయి అని తెలిసినా కూడా నిజమే చెప్పమని పిల్లలకు చెప్పేవారు, మా క్లాసులో బహు తుంటరి పిల్లలు కూడా స్కూలు వదిలి వెళ్ళే సమయానికి సరి కొత్త విద్యారుల్థుగా మారారు అంటే మీరు నమ్ముతారా? ఆయన క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించేవారు కారు. అతి నెమ్మదిగా మాట్లాడే ఆ మనిషి క్లాసులో అంత మంది పిల్లలను ఎలా కట్టుదిట్టంగా ఉంచగలరు అని కొందరికి అనుమానం కూడానూ! మా క్లాసులో కండలు తిరిగిన ఓ మొద్దబ్బాయి ఉండేవాడు, తల్లీ తండ్రీ స్కూల్ దాకా పంపగలిగారే గానీ వాడికి చదువు అబ్బే భారం స్కూల్ టీచర్లకే వదిలిపెట్టారు. ప్రతీ టీచర్‌ను ఏడిపించటమే సత్తిరాజు ధ్యేయం. బలహీనులు అయిన తత్తిమ్మా స్టూడెంట్లు ఈ ఆగడాలు చూస్తూ నోరు నొక్కుకునే వారే కానీ వాడిని

ఎదిరిస్తే స్కూల్ వదిలాక జరిగే గలాటా తలుచుకుని భయపడేవారు. అమ్మాయిలంతా మాకు ఎందుకులే అని కిమ్మనకుండా ఉండేవారు. దానితో రెచ్చిపోయేవాడు ఈ తుంటరి. ఓ రోజు మాస్టారు క్లాస్‌కి రాక మునుపే ఈ గడ్డరి పిల్లాడు బోర్డ్ మీద కళ్ళ జోడుతో సహా - మాష్టారి బొమ్మను వ్యంగ్యంగా చిత్రించి వచ్చి క్లాసులో కూర్చున్నాడు. ఆ తరువాత ఆయన క్లాస్‌కి వసూనే బోర్డ్ చూసి సన్నగా నవ్వుతూ 'అరే సత్తిరాజూ! నా బొమ్మకు మీసాలు మర్చిపోయావు సరిగా వెయ్యి' అని అంటూ కుర్చీలో కూర్చున్నారు. అంతే సత్తిరాజు నోట మాట రాలేదు. నిశబ్ధంగా క్లాసు గడిచింది. క్లాసు తరువాత పెద్దిరాజు పరుగున మాస్టారి దగ్గరకు వెళ్ళటం చూసిన నాకు దూరంగా వినపడసాగాయి వారి మాటలు. సత్తిరాజు క్షమాణ చెప్పిన తీరు దానికి ఆయన ఎంతో సౌమ్యంగా సమాధానం ఇస్తున్న తీరు చూస్తే ఆయన నిజంగా గాంధీ గారి ప్రతి రూపమా అనిపించింది. ఆ తరువాత అటువంటి చిన్న చిన్న సంఘటనలు ఆ కుర్రాడు చెయ్యటం మాష్టారి శిక్షణతో అతను స్కూల్ వదిలే సరికి పూర్తిగా ఒక కొత్త వ్యక్తిగా మారిన తీరు మా క్లాస్ పిల్లలను ఎంతో ఆశ్చర్యపరచింది. ఎవరైనా టీచరు రాకపోతే మా మాస్టారు కథలు చెప్పేవారు. అంటే చందమామ కథలు కాదు, స్వరాజ్యం కోసం జరిగిన పోరాటాలు వాటి వెనుక ఉన్న నాయకులు, వారి గొప్పతనం చాటి చెప్పేవారు.

నాకు మాస్టారు అంటే వల్లమాలిన గౌరవం, నేను ఆయన్ను ఎప్పుడూ అలాగే పిలిచేదాన్ని. మాష్టారి ప్రభావం నా స్కూలు జీవితంపై కావచ్చు, సంగీతం నేర్చుకునే విషయంలో కావచ్చు ఎంతైనా ఉన్నదని నేను గట్టిగా నమ్ముతాను. అప్పట్లో 7వ క్లాసుకు కూడా స్కూల్ ఫైనల్‌లాగా ఎక్జామినేషన్ ఉండేది, దానికి ఎంతో కష్టపడి చదివిన నాకు గొప్ప ఫలితం దక్కిన రోజు ఎప్పటికీ మరువలేనిది. చదువు అనేది మన కోసం చదువుకోవాలని, మనను ఒక మంచి వ్యక్తిగా తీర్చిదిద్దేది మన జ్ఞానమేనని, అది దొంగలు కూడా దోచుకొనలేరని కథలా చెప్పేవారు. ఏ పని అయినా పట్టుదలతో సాధించవచ్చని తరచూ చెబుతుండేవారు ఆయన, ఇది నాపై ఎంతో ప్రభావాన్ని చూపించింది. ఆ ప్రభావమే నేను ఈ రోజు కేవలం చదువు ఉద్యోగము అని పట్టుకు కూర్చోకుండా సమయాన్ని, వివిధ రకాలుగా వినియోగించుకోవాలనే ఒక కొత్త ఆలోచనను పెంపొందింప చేసింది. ఆస్ట్రేలియా వచ్చినప్పుడు మా అబ్బాయిలు చంటి పిల్లలు. వెంటనే ఉద్యోగంలో చేరలేకపోయాను. కాలం వృధా అవుతున్న విషయం గ్రహించి మూడు డిగ్రీలు సంపాదించుకోగలిగాను... దానికి పట్టుదలని స్ఫూర్తిని ఎలా సాధించానో మా మాష్టారికే తెలుసు.

ఇక ఫైనల్స్ అయ్యి స్కూలు వదిలి వెళ్ళే రోజులు రానే వచ్చాయి. నాకు, నా లాంటి మరెందరో మిత్రులకు ఇదే ఒక తీరని బాధ. అందరం కలిసి మాస్టారుతో గుర్తుగా ఫొటో తీయించుకున్నాము, ఆయనకు మంచి బహుమతిని గుర్తుగా తెచ్చి ఒక ఎర్రగులాబీతో సహా - ఇచ్చాము. దానికి ఆయన కళ్ళు చెమర్చాయి. అప్పటికే దాదాపు రిటైర్మెంట్‌కి దగ్గరగా ఉన్నారని అందరికి తెలుసు. అందరము తలో దారికి రకరకాల కాలేజీలల్లో చేరిపోయాము. మేము కూడా ఇల్లు కట్టుకుని వేరే కాలనీకి వెళ్ళటంతో మా స్కూల్‌తో ఇక సంబంధం తగ్గిపోయింది. ఓ రోజు అనుకోకుండా మాష్టారు మళ్ళీ మా కాలనీలో కనపడ్డప్పుడు నా ఆనందానికి హద్దులు లేవు. తరువాత తెలిసింది ఆయన ఉండేది మా కాలనీలోనే అని. ఇంకా గొప్ప వింత ఏమంటే నేను వీణ నేర్చుకునే సంగీతం టీచరు గారి ప్రక్క ఇల్లే మా మాష్టారు గారి ఇల్లు అవ్వటం. ఇంక నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు... ఏరోజు అమ్మా నాన్నా చెప్పక ముందే సంగీతం క్లాసుకు పరిగెత్తేదాన్ని. పాఠం పూర్తయ్యాక మాష్టారి ఇంటి ముందు అరుగు మీద, మాష్టారు వాళ్ళ ఆవిడ కూర్చుని మాలాంటివారిని పలకరిస్తుండేవాళ్ళు. నేను వెళ్ళి కాసిని కబుర్లు చెప్పేదాన్ని. అప్పటికి ఆయన రిటైరు అయ్యారు మాష్టారుకు పిల్లలు లేకపోవటంతో ఆయనకు మేమంటే మరీ ఇష్టం. నా కాలేజీ కబుర్లు ఎంతో ఇష్టంగా వినేవారు, రాజకీయాలు గట్రా మాట్లాడేవారు. ఆయన ఒక మంచి మిత్రుడు అని కూడ అనిపించేది. నా పెళ్ళి కబురు మానాన్నగారి ద్వారా విని ఎంతో సంతోషించారు ఆయన, నా పెళ్ళికి మాష్టారు వచ్చి అక్షింతలు వేసారు. ఆ తరువాత దేశం వదిలి రావటంతో ఆయనను మునుపటిలా చూడలేకపోయాను. నేను ఇక్కడకు వచ్చిన పది సంవత్సరాలకు కాబోలు మా మాస్టారు ఇకలేరని తెలిసింది. నాకళ్ళల్లో కన్నీళ్ళు ఆగలేదు. 75 సంవత్సరాలు వచ్చినా అయ్యో మాస్టారు

ఇంత త్వరగా వెళ్ళిపోయారే అని బాధపడ్డాను. వారి సతీమణి ఒక కుర్రవాడిని దత్తత తీసుకున్నారని తెలిసి చూడటానికి వెళ్ళాను. ఆయన ఇల్లు బోసిగా కనపడింది. మాష్టారుగారి నవ్వుతున్న మొహం పూలదండల మధ్య కన్పడి నాకళ్ళు మసకబారాయి!



*జయగారు ఇండియాలో బాచిలర్ ఆఫ్ సైన్సు అండ్ మాస్టర్స్ ఇన్ సైకాలజీ పూర్తి చేసి, తరువాత ఆస్ట్రేలియాలో **Information Technology in Sydney**లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసారు. జయగారికి వీణ వాయించడం, కమ్యూనిటీ రేడియో బ్రాడ్కాస్టింగ్, కమ్యూనిటీ సర్వీస్ హాబీలు. భర్త,పిల్లలతో ఆస్ట్రేలియా నివసిస్తున్నారు.*

